చివరి ఆయకట్టుకు కటకట

- సోమశిల నిండుకుండలా ఉన్నా దుస్థితి
- కాలువల్లో పేరుకుపోయిన పూడిక
- దక్షిణ కాలువ కింద పారని సాగునీరు
- గ్రామాల్లో ఎండుతున్న వరినాట్లు

పొదలకూరు: సోమశిల, కండలేరు జలాశయాలు నిండుకుండలా ఉన్నా, కాలువల్లో పేరుకుపోయిన పూడిక.. నీటి యాజమాన్య పద్ధతులు సక్రమంగా లేక కొన్ని గ్రామాల్లో వరినాట్లు ఎండుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువల్లో పూడిక పనులను ఇరిగేషన్ అధికారులు సకాలంలో చేపట్టి ఉంటే చివరి ఆయకట్టు వరకు సాగునీరం దేదని పేర్కొంటున్నారు. మండలంలోని చెన్నారెడ్డిపల్లి, నావూరు, భోగసముద్రం, బత్తులపల్లి, చేజర్ల మండలం రెడ్డివారికండ్రిక గ్రామాలకు దక్షిణ కాలువ, దాని ఉప కాలువల ద్వారా సాగునీటి సౌకర్యం ఉంది. నాన్ డెల్టా కింద ఉండే ఈ గ్రామాలకు సాగునీటిని అందించడంతో ఏటా రబీలో వరి పైర్లు పండుతున్నాయి. ప్రస్తుత రబీలో సోమశిలలో 73 టీఎంసీలు నిల్వ ఉన్నా, దక్షిణ కాలువ దాని ఉప కాలువలైన 26 ఎల్, 7 ఆర్ కాలువలకు సాగునీరు సక్రమంగా అందడంలేదు. దీంతో నాట్లు ఎక్కడ ఎండిపోతాయోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు కాలువ వెంబడి అనధికారికంగా మోటార్లను ఏర్పాటు చేయడంతో చివరి గ్రామాలకు సాగునీరందడం లేదు. పగటి వేళ కాలువకు చుక్కనీరు రాక రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

మూడు వేల ఎకరాల్లో సాగు

దక్షిణ కాలువ, దాని ఉప కాలువల ద్వారా చివరి గ్రామాలైన చెన్నారెడ్డిపల్లి, నావూరు, భోగసముద్రం, బత్తులపల్లి గ్రామాల్లో సుమారు మూడు వేల ఎకరాల్లో రబీలో వరినాట్లు పడే అవకాశం ఉంది.



చెన్నారెడ్డిపల్లిలో ఎండుతున్న వరినాట్లు

ప్రస్తుతం వెయ్యి ఎకరాల్లో నాట్లు పడ్డాయని రైతులు వెల్లడించారు. చేజర్ల మండలం చీర్లవారికండ్రిక – వావిలేరు గ్రామాల మధ్యలో కాలువకు సంబంధించి రైతులు చందాలు పోగుచేసుకొని సుమారు మూడు కిలోమీటర్ల మేర పూడిక తొలగించారు. దక్షిణ కాలువ సమీపంలో 7 ఆర్ టేకాఫ్ తీసుకునే వద్ద నుంచి చెన్నారెడ్డిపల్లి వరకు సుమారు ఐదు కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఈ కాలువ మధ్యలో పూడిక పేరుకుపోవడంతో నీరు సక్రమంగా సరఫరా కావడంలేదు. ఎగువ ప్రాంత రైతులు అనధికారికంగా విద్యుత్ మోటార్లను కాలువకు అమర్చి నీటిని పంపింగ్ చేసుకోవడంతో పగటి వేళ కాలువకు చాలా తక్కువగా నీరందుతోంది. దీంతో వరినాట్లు ఎండే దశకు చేరుకుంటున్నాయని రైతులు వాపోతున్నారు. కాలువలో పూడిక తొలగింపు పనులకు ఇరిగేషన్ అధికారులు టెండర్లు పిలిచినా, కాంట్రాక్టర్లు ముందుకు రాలేదని తెలుస్తోంది. దీంతో ఈ రబీలో చివరి ఆయకట్టు గ్రామాల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



కాలువకు స్వల్పంగా వస్తున్న సాగునీరు

120 క్యూసెక్కుల విడుదల

దక్షిణ కాలువ, దాని ఉప కాలువ 7 ఆర్ సామర్థ్యం 90 క్యూసెక్కులైతే 120 క్యూసెక్కులను విడుదల చేస్తున్నాం. అంతకు మించి పెంచితే పొర్లుతుంది. కాలువను పరిశీలించి వాటర్ మేనేజ్‌మెంట్ చేస్తాం. అనధికారిక మోటార్లు, ఆయకట్టు పెరగడంతో ఇలాంటి సమస్యలొస్తున్నాయి. ఏడు వేల ఎకరాల ఆయకట్టుకు సరిపడా కాలువను తవ్వాం. అయితే 12 వేల ఎకరాల ఆయకట్టు ప్రస్తుతం ఉంది.

– సుధీర్, డీఈఈ, సోమశిల సబ్ డివిజన్, చేజర్ల

సాగునీటి ఇబ్బందులు తొలగించాలి



చివరి గ్రామాలైన చెన్నారెడ్డిపల్లి, భోగసముద్రం, బత్తులపల్లి గ్రామాల్లో సాగునీటికి ఇబ్బందులను తొలగించాలి. కాలువ వెంబడి రైతులు పర్యటించినా ఎలాంటి ఉపయోగం ఉండటంలేదు. నాట్లు ముమ్మరంగా వేసుకుంటున్న సమయంలో నీరు సక్రమంగా రాకపోవడంతో నష్టపోయే ప్రమాదం ఉంది.

– మాలకొండారెడ్డి, రైతు, చెన్నారెడ్డిపల్లి

అధికారులు జోక్యం చేసుకోవాలి



ఇరిగేషన్ అధికారులు జోక్యం చేసుకొని కాలువకు నీరు సజావుగా పారేలా చూడాలి. 7 ఆర్ కాలువ మధ్యలో పూడిక కొంతమేర పేరుకుపోయింది. పగటి వేళ కాలువకు నీరు సక్రమంగా రాక నాట్లు దెబ్బతినే పరిస్థితికి చేరుకుంటున్నాయి. సంబంధిత అధికారులు చొరవ చూపాలి.

– బాలకొండారెడ్డి, రైతు, నావూరు

క్లుప్తంగా

గ్రామ దేవతలకు పూజలు



మనుబోలు: మనుబోలు గ్రామ దేవతలు మనుబోలమ్మ, నాగార్పమ్మకు ప్రత్యేక పూజలను గ్రామస్తులు ఆదివారం నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. పూజా కార్యక్రమాలను అర్చకుడు ఫణీంద్రశర్మ ఆధ్వర్యంలో జరిపారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో గ్రామదేవతలను దర్శించుకొని సలిపిండి, పానకాలను నైవేద్యంగా సమర్పించారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

ముత్తుకూరు: మండలంలోని బ్రహ్మదేవి, ఈదులవారిపాళెం, కోమటిగుంట, గోవిందరెడ్డిపాళెం, పొట్టెంపాడు గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారాన్ని ఆదివారం నిర్వహించారు. ప్రబోధ సేవా సమితి – ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని జరిపారు. నెల్లూరు కమిటీ అధ్యక్షుడు సురమౌళి, లీలావతి, మహేంద్ర కృష్ణ, రమాదేవి, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

మట్టి అక్రమ తవ్వకాలపై ఫిర్యాదు

నెల్లూరు(క్రైమ్) : ప్రభుత్వ భూముల్లో అక్రమంగా మట్టి తవ్వి తరలిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అంబాపురం గ్రామ రెవెన్యూ అధికారి రమణయ్య ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. నెల్లూరు రూరల్ మండలం అక్కచెరువుపాడు గ్రామంలోని ప్రభుత్వ భూముల్లో కొందరు ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి తవ్వి తరలిస్తున్నారు. ఈ విషయాన్ని ఆ గ్రామ వీఆర్‌ఏ రాగయ్య ఈనెల మూడో తేదీన అంబాపురం వీఆర్వో రమణయ్యకు తెలియజేశారు. దీంతో ఆయన ఘటనా స్థలానికి చేరుకుని అక్రమంగా మట్టిని తరలిస్తున్న రెండు ట్రాక్టర్‌లను స్వాధీనం చేసుకున్నారు. విషయాన్ని రెవెన్యూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వారి ఆదేశాల మేరకు రమణయ్య ఆదివారం వేదాయపాళెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారిస్తున్నారు.

ఘనంగా విశ్వనాథక్రౌతుల జయంతి



నెల్లూరు(బృందావనం) : నగరంలోని టీపీఎస్ కల్యాణ సదన్‌లో వేదసాహిత్య పరిషత్ నెల్లూరు ఆధ్వర్యంలో బ్రహ్మశ్రీ అరివిత్తూరు విశ్వనాథక్రౌతుల వారి జయంతి సభ ఆదివారం ఘనంగా జరిగింది. తొలుత గణపతి పూజ, కలశ స్థాపన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. వేదపండితులు నేలనూతల గురుదత్తశర్మ, సూరం వెంకట సుకుమార్‌శర్మలచే సాయంత్రం కృష్ణయజుర్వేద పారాయణం గావించారు. కార్యక్రమంలో అరివిత్తూరు భార్గవ గణపతిశర్మ, స్వయంపాకుల మురళీకృష్ణ, మాచవోలు రమేష్‌శర్మ పాల్గొన్నారు.

పాటూరు శ్రీనివాసులుకు సన్మానం



నెల్లూరు(బృందావనం) : నగరంలోని పురమందిరంలో కేతా అంకులు మెమోరియల్ ట్రస్ట్, కేతా సుబ్బారావు ప్రజావేదిక సంయుక్త ఆధ్వర్యంలో 'అమ్మానాన్నలను పూజించండి' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు కేతా సుబ్బారావు మాట్లాడుతూ భారతదేశంలో తల్లిదండ్రులకు ఎంతో విశిష్ట స్థానం ఉందన్నారు. అనంతరం గాయకుడు పాటూరు శ్రీనివాసులును సన్మానించారు. తల్లిదండ్రుల ప్రాధాన్యతను వివరిస్తూ పాటల పోటీలు నిర్వహించారు. అలాగే శాస్త్రీయ, నృత్య పోటీలను జరిపించారు. విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో నాగినేని ప్రభాకర్, ఆనంద్, నజీర్‌బాషా గురూజీ, కనకరాజు, షఫీ, అమానుల్లాఖాన్ పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ

నెల్లూరు(సెంట్రల్) : పర్వతరెడ్డి బలరామిరెడ్డి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో బారాషహీద్ దర్గా ప్రాంతంలో నిరుపేదలకు ఆదివారం దుప్పట్లు, ఆహార ప్యాకెట్లను పంపిణీ చేసినట్లు ట్రస్టీ శ్రవంతి అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేవసేనారెడ్డి వర్ధంతి సందర్భంగా ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలను చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రమణారెడ్డి, సురేష్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

పడుగుపాడులో వైద్య శిబిరం



కోవూరు : మండలంలోని పోతిరెడ్డిపాళెం గ్రామంలో తిరుమూరు అశోక్‌రెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఆదివారం జరిగింది. ఆర్‌ఆర్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి సౌజన్యంతో సుమారు 200 మందికిపైగా వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆర్‌ఆర్ ఆస్పత్రి వైద్యుడు జీఆర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు వైద్యం అందించాలనే లక్ష్యంతోనే ఇలాంటి శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యద్దలపూడి నాగరాజు, జీవీ నాగరాజు, కిశోర్ యాదవ్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు నిత్యావసర సరుకులు

విడవలూరు : మండలంలోని పార్లపల్లి గ్రామంలో ఏఆర్డీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గిరిజనులకు ఆదివారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి హాజరై, సరుకులను అందించారు. గిరిజనుల సంక్షేమానికి కృషి చేస్తున్న ఎన్జీఓ సంస్థను ఆమె అభినందించారు. కార్యక్రమంలో ఏఆర్డీ సంస్థ డైరెక్టర్ బషీర్, ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ హుస్సేన్, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రసన్న ఆశీర్వాదం



కోవూరు : రేబాల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు బోగోలు దయాకర్‌రెడ్డి కుమార్తె కల్యాణి, హరికృష్ణారెడ్డిల వివాహం బుచ్చిరెడ్డిపాళెంలోని కేవీఆర్ కల్యాణ మండపంలో ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పాల్గొని, వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట పార్టీ నేతలు చెర్లో సతీష్‌రెడ్డి, షకీలాబేగం, డాక్టర్ అల్లాభక్షు ఉన్నారు.

ఘనంగా అంబళ్ల పూజ



పొదలకూరు: మండలంలోని మొగళ్లూరులో అయ్యప్పస్వామి అంబళ్లపూజ వేడుకగా ఆదివారం రాత్రి నిర్వహించారు. అయ్యప్ప మాలధారులు స్వామివారి గీతాలను ఆలపించి భజనలు చేశారు. భక్తులకు అన్నప్రసాదాలను అందజేశారు.

జాతీయ స్థాయి విద్యా పురస్కారం



అందుకున్న పురస్కారంతో సురేష్

పొదలకూరు: పట్టణంలోని అమరావతి ఇంగ్లిష్ మీడియం స్కూల్‌కు జాతీయ స్థాయిలో విద్యా పురస్కారం లభించిందని కరస్పాండెంట్ సురేష్ పేర్కొన్నారు. హైదరాబాద్‌లో జాతీయ విద్యా సదస్సులను ఈటీ టెక్ ఎక్స్, బ్రెయిన్‌ఫీడ్ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల ఐదు నుంచి ఏడు వరకు నిర్వహించారని చెప్పారు. ఇందులో భాగంగా విద్యారంగంలో విశిష్ట సేవలందించినందుకు గానూ ట్రెయిల్ బ్రేజర్ స్కూల్ ఆఫ్ ది ఇయర్ అవార్డును తమ పాఠశాలకు అందజేశారని తెలిపారు.

అదనపు భూమి కేటాయించాలని వినతి

ముత్తుకూరు: ముత్తుకూరులోని ముస్లింల శ్మశానం, ఈద్గాకు ప్రస్తుతం ఉన్న స్థలం సరిపోదని, అదనంగా కేటాయించాలని నేతలు కోరారు. ఈ మేరకు సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి వినతిపత్రాన్ని ఆదివారం అందజేశారు. మల్లికార్జునయాదవ్, షఫీఉల్లా, మహబూబ్‌బాషా, ఫరీద్‌బాబు, కాలేషా, రషీద్, నాగూర్ ఘనీ తదితరులు పాల్గొన్నారు.

కిక్కిరిస్తున్న చేపల మార్కెట్

- తూకాల్లో తేడాలు

పొదలకూరు: పట్టణంలోని రామనగర్ గేట్ సెంటర్‌లో గల చేపల మార్కెట్ ఆదివారం కిక్కిరిసిపోతోంది. ఒక్కో సమయంలో ట్రాఫిక్ సైతం స్తంభిస్తోంది. చేపల మార్కెట్‌ను రోడ్డుపైనే ఏర్పాటు చేస్తుండటంతో రద్దీ పెరుగుతోంది. మరోవైపు ఇక్కడ ఎలక్ట్రికల్ తూకాలు కాకుండా పాత పద్ధతిలో తూకాలు వేస్తున్నారు. లీగల్ మెట్రాలజీ శాఖ వారు గతంలో చేపల మార్కెట్‌పై దాడులు నిర్వహించి తూకాలను పరిశీలించి జరిమానాలను సైతం విధించారు. చేపల మార్కెట్‌ను పట్టణానికి సమీపంలో మరెక్కడైనా ఏర్పాటు చేస్తే బాగుంటుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.



చినుకు పడితే రాకపోకలు బంద్

రైల్వే శాఖ రూ.కోట్లు వెచ్చించి అండర్ పాస్ నిర్మించింది. వర్షపు నీరెళ్లేందుకు పైపులైన్ కూడా ఏర్పాటు చేశారు. అయితే ఇది పూడికతో నిండడంతో చుక్కనీరు బయటకు వెళ్లడం లేదు. ఒకసారి వర్షం కురిస్తే నెలలు గడిచినా నీరు బయటకు పోక రాకపోకలు సాగడం లేదు. వర్షపు నీరు లోనికి వెళ్లకుండా పైకప్పు నిర్మాణం సగం మాత్రమే పూర్తికావడంతో దీనివల్ల ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది.



ఫెంగల్ తుఫాన్‌కు అండర్ పాస్‌లో నిలిచిపోయిన వర్షపు నీరు

- అండర్ పాస్‌లో చుక్క నీరు బయటకు వెళ్లని దుస్థితి
- నెలల తరబడి ఇదే తంతు
- నిరుపయోగంగా టపాతోపు అండర్ బ్రిడ్జి

కొడవలూరు : మండలంలోని టపాతోపు వద్ద రూ.11 కోట్ల వ్యయంతో నిర్మించిన అండర్ బ్రిడ్జిని ఈ ఏడాది ఫిబ్రవరి 26న ప్రారంభించారు. అయితే పట్టుమని నెల రోజుల పాటు ఇందులో రాకపోకలు సాగిన పాపాన పోలేదు. నిర్మాణ సమయంలోనే వర్షపు నీరు వెళ్లేందుకు సమీపంలోని మలిదేవి వరకు పైపులైన్ కూడా ఏర్పాటు చేశారు. అయితే నిర్మాణం లోపభూయిష్టంగా జరగడంతో మరుసటి నెలలో కురిసిన వర్షానికే పైపులైన్ పూడికతో నిండి చుక్క నీరు బయటకు వెళ్లలేదు. దీనిపై రైల్వే అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

మోటార్లతో నీటిని పంపాలి

సాధారణంగా అండర్ పాస్‌లలో చేరుతున్న వర్షపు నీటిని మోటార్‌ల సాయంతో బయటకు పంపి రాకపోకలు పునరుద్ధరిస్తారు. అయితే ఇక్కడ అలాంటి చర్యలేమీ తీసుకోవడం లేదు. వర్షపు నీరు ఎండకు పూర్తిగా ఆవిరయ్యే వరకు రాకపోకలు సాగడం లేదు. ఇటీవల ఫెంగల్ తుఫాన్ వల్ల కురిసిన వర్షాలకు ఇక్కడి అండర్ పాస్ 80 శాతం వర్షపు నీటితో నిండిపోయింది. అప్పటి నుంచి రోజులు గడుస్తున్నా వాహన రాకపోకలను పునరుద్ధరించడం లేదు.

అసంపూర్తి పైకప్పుతో ప్రయోజనం శూన్యం

వర్షపు నీరు బ్రిడ్జిలోనికి వెళ్లకుండా నాలుగు నెలల క్రితం పైకప్పు నిర్మాణం చేపట్టారు. అయితే దీనిని సగభాగం మాత్రమే నిర్మించి వదిలేశారు. దీనివల్ల ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. పైకప్పు నిర్మాణం పూర్తిగా జరిగితే బ్రిడ్జిలోనికి వర్షపు నీరు వెళ్లకుండా చేయవచ్చని రైల్వే అధికారులే చెబుతున్నారు. కానీ ఆ దిశగా ప్రయత్నాలు జరగడం లేదు. అండర్ పాస్‌లు నిర్మించిన చాలా చోట్ల పైపులైన్‌లు ఏర్పాటు చేసినప్పటికీ విజయవంతం కావడం లేదన్న ప్రచారం ఉంది. ఈ నేపథ్యంలో పైకప్పు నిర్మాణం చేసి బ్రిడ్జి బయట పడుతున్న వర్షపు నీటిని సులువుగా సమీపంలోని మలిదేవికి పంపే మార్గం ఉత్తమమని నిపుణులు సూచిస్తున్నా ఆచరణకు నోచుకోవడం లేదు.

ప్రాధాన్యమున్నా.. ఫలితం లేదు

టపాతోపు అండర్ పాస్‌కు ఎంతో ప్రాధాన్యముంది. కొడవలూరు, అల్లూరు, విడవలూరు మండలాలకు వెళ్లాలంటే కేవలం కొడవలూరు రైల్వేగేటు ఒక్కటే మార్గం. మూడో రైల్వే లైన్ ఏర్పాటయ్యాక మూడు లేదా నాలుగు రైళ్లు వెళ్లే వరకు కూడా గేటు తీయడం లేదు. దీంతో గేటు ఒకసారి మూతపడితే వాహనదారులు 30 నుంచి 45 నిమిషాల పాటు కూడా వేచి ఉండాల్సి వస్తోంది. మూడు మండలాలకు వెళ్లేందుకు ఒకే మార్గం కావడంతో ఆ సమయంలో పెద్ద సంఖ్యలో వాహనాలు బారులు తీరి నిలిచిపోతున్నాయి. గేటు తీశాక అన్నీ ఒక్కసారిగా గేటులోనికి ప్రవేశిస్తుండడంతో ట్రాఫిక్ స్తంభిస్తోంది. మళ్లీ రైలు వచ్చే వరకు కూడా ట్రాఫిక్ క్లియర్ కాకపోవడంతో రైలునే నిలిపి వేస్తున్న సందర్భాలు తరచూ చోటుచేసుకుంటున్నాయి. ఈ సమస్యకు పరిష్కారం టపాతోపు అండర్‌పాస్ మాత్రమే. ఇంతటి ప్రాధాన్యమున్న అండర్ పాస్ పట్ల రైల్వే అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది.

నిర్లక్ష్యం వీడాలి



టపాతోపు అండర్ పాస్ నిర్వహణపై అధికారులు నిర్లక్ష్యం వీడాలి. ఇక్కడి సమస్యను అనేక పర్యాయాలు రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అయినప్పటికీ వారు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. రూ.కోట్లు కుమ్మరించి నిర్మిస్తున్నారే తప్ప నిర్వహణ గురించి పట్టించుకోవడం లేదు.

– ఎం.ప్రసన్నకుమార్, నార్తురాజుపాళెం

శాశ్వత పరిష్కారం చూపాలి



టపాతోపు అండర్ పాస్ వద్ద నిరంతరం వాహన రాకపోకలు సాగేలా శాశ్వత పరిష్కారం చూపాలి. పైకప్పు నిర్మాణం పూర్తి చేయడం గానీ, వర్షపు నీటిని మోటార్‌ల సాయంతో బయటకు పంపడం గానీ చేయాలి. రైల్వే అధికారులు పట్టించుకోకపోవడం వారి అలసత్వానికి అద్దం పడుతోంది.

– కె.రమేష్‌బాబు, కొడవలూరు



సగమే నిర్మితమైన అండర్ పాస్ పైకప్పు



రాకపోకలు నిలిపివేసినట్లు ఏర్పాటు చేసిన బోర్డు